










సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

గురువారం 26-9-2024

సంపుటి: 20 సంచిక: 157
పేజీలు: 4 వెల: రూ.1


## వంద రోజుల్లోనే సంతృప్తికర పాలన

- శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్
- ఇబ్రహీంబాద్‌లో ఇది మంచి ప్రభుత్వం



(సత్యంన్యూస్, గార)

రాష్ట్రంలో ప్రస్తుతం ప్రజలకు సంతృప్తికర పాలన అందుతోందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. ఇబ్రహీంబాద్‌లో గురువారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ రాష్ట్రాన్ని సంక్షోభం నుంచి సంక్షేమం వైపు నడిపిస్తున్న ఇది మంచి ప్రభుత్వమని, 40 సంవత్సరాలు సుదీర్ఘ రాజకీయ చరిత్ర ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాలుగోసారి బాధ్యతలు స్వీకరించి రాష్ట్రాన్ని సంక్షేమ అభివృద్ధి పథంలోకి తీసుకువెళుతున్నారని పేర్కొన్నారు. ఇది మంచి ప్రభుత్వమని, ఎందుకంటే సంక్షోభంలోనూ సంక్షేమం అందించి, అభివృద్ధికి రెక్కలు తొడిగి, మొదటి 100 రోజుల్లోనే 'ఇది మంచి ప్రభుత్వం!' అని ప్రజలతో అనిపించుకుంటోందన్నారు. కూటమి ప్రభుత్వం మాటలకే పరిమితం కాకుండా ఇచ్చిన ప్రతీ హామీ నెరవేర్చే దిశగా అడుగులు వేస్తూ ప్రజా సంక్షేమాన్ని పరుగులు పెట్టిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కూటమి మండల నాయకులు, కార్యకర్తలు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, స్థానిక నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు



- సబ్జెక్ట్ టీచర్స్ నియామకం వైపు అడుగులు
- యూనివర్సిటీల్లో అక్రమాలపై నివేదిక కోరాం
- విద్యావ్యవస్థ బలోపేతానికి కట్టుబడి ఉన్నాం
- సూపర్-6ను చిత్తశుద్ధితో అమలుచేస్తాం
- నగరంలో మంత్రి లోకేష్ ఆకస్మిక పర్యటన



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడిని వచ్చే విద్యా సంవత్సరం నుంచి నియమించనున్నట్టు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేష్ స్పష్టం చేశారు. అదే పద్ధతిలో సబ్జెక్ట్ టీచర్ల నియామకానికి చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. విశాఖపట్నంలో ప్రజాదర్బార్‌లో పాల్గొనేందుకు వచ్చిన మంత్రి లోకేష్ అక్కడ నుంచి రోడ్డు మార్గంలో పాతర్లపల్లి పాఠశాలలో షేడ్ కూలి విద్యార్థి మరణించిన ఘటన స్థలానికి వెళ్లారు. ఈ విషయం ఎచ్చెర్ల నియోజకవర్గంలో టీడీపీ నాయకులెవరికీ



తెలియదు. అదే సమయంలో ఎమ్మెల్యే ఎన్ఈఆర్ మరో కార్యక్రమంలో ఉన్నారు. అక్కడి నుంచి నేరుగా శ్రీకాకుళం చేరుకొని నగరంలోని ఎచ్చెర్లవీధిలో మున్సిపల్ ఎలిమెంటరీ స్కూల్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. ఇక్కడ కూడా టీడీపీ నాయకులకు నారా లోకేష్ వచ్చిన విషయం ఏమాత్రం తెలియదు. ముందుగా పసిగట్టిన మీడియా కన్ఫర్మేషన్ కోసం తెలుగుదేశం నేతలకు వాకబు చేసిన తర్వాత మాత్రమే వారికి తెలిసింది. విద్యార్థులతో ముచ్చటించి, మధ్యాహ్న భోజనం, ఆంగ్ల మాధ్యమం, పాఠశాలలో మౌలిక సదుపాయాలు, విద్యాబోధన తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎన్విరాన్‌మెంట్ సైన్స్‌పై విద్యార్థులకు కొన్ని ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. ఈ సందర్భంగా ఒక విద్యార్థి మధ్యాహ్న భోజనంలో పెరుగు సరఫరా చేయాలని కోరగా, సాధ్యం కాదని తెలిపారు. మరో విద్యార్థి తరగతి గదిలో బెంచీలు కావాలని కోరగా, తప్పనిసరిగా సమకూర్చుతామన్నారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులతో సమీక్షించి విద్యావ్యవస్థ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలోని మరుగుదొడ్లను పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం చేయడానికి కట్టుబడి ఉన్నామన్నారు. గత ప్రభుత్వం విద్యావ్యవస్థను భ్రష్టుపట్టించిందని, దాన్ని గాడిలో పెట్టే ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, ఇతర విద్యాపరమైన అంశాలపై ప్రభుత్వంలో ముఖ్యమంత్రి స్థాయి నుంచి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాఠశాల పేరెంట్



కమిటీతో సమావేశమై వారి అభిప్రాయాలను తీసుకొని వీటి ఆధారంగా బలోపేతానికి చర్యలు తీసుకుంటామన్నారు. వీసీలుగా చేసినవారంతా వైకాపా కార్యకర్తలే వైకాపా హయాంలో రాష్ట్రంలో యూనివర్సిటీల్లో వీసీలుగా చేసిన వారంతా వైకాపా కార్యకర్తలేనన్నారు. ఆంధ్రా యూనివర్సిటీలో వైకాపా హయాంలో ఏమి జరిగిందో అందరూ చూశారని గుర్తుచేశారు. అదే మాదిరిగా అన్ని యూనివర్సిటీల్లో జరిగిన అక్రమాలు, అవినీతిపై ఉన్నతాధికారులకు నివేదిక కోరామన్నారు. పూర్తి స్థాయి విచారణ నివేదిక వచ్చిన తర్వాత బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. వైకాపా హయాంలో చట్టాన్ని చేతుల్లో తీసుకొని టీడీపీ కార్యకర్తలు, ప్రజలను వేధించి హింసించారని, అలాంటి వారిని చట్టం పరిధిలో శిక్షిస్తామన్న అంశాన్నే బహిరంగ వేదికలపై ప్రస్తావించానన్నారు. దాని ఫలితంగానే ముగ్గురు ఐపీఎస్‌లను సస్పెండ్ అయ్యారన్నారు. మత విశ్వాసాలను కాపాడాలన్నదే కూటమి

- మిగతా 4లో






## జిల్లా జైలుకు టీవీల బహూకరణ




(సత్యంన్యూస్, శ్రీకాకుళం రూరల్)

విశాఖపట్నానికి చెందిన శ్రీదేవి విజ్ఞానజ్యోతి పరిష్కార్ ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షురాలు డాక్టర్ కుప్పిలి కీర్తి పట్నాయక్ తన తండ్రి డాక్టర్ కుప్పిలి త్రినాథరావు జ్ఞాపకార్థం అంపోలు రోడ్డులోని జిల్లా జైలుకు రెండు ప్లాట్ టీవీలను జైలు సూపరెంటెండంట్ సన్యాసిరావు చేతుల మీదుగా బహూకరించారు. గత 22 సంవత్సరాలుగా సొంత ఖర్చులతో లక్షలాది రూపాయలను వెచ్చిస్తూ స్వచ్ఛంద సేవలను చేయడాన్ని ఈ సందర్భంగా జిల్లా జైలు సూపరింటెండెంట్ సన్యాసిరావు అభినందించారు. తండ్రి జ్ఞాపకార్థం అన్నదానం, వస్త్రదానం, రక్తదానం, మొక్కల పంపిణీ, వస్తు సామగ్రి అందజేడం వంటి విశేషమైన సేవలు కీర్తి పట్నాయక్ చేస్తున్నారు. ఈ సందర్భంగా కీర్తి పట్నాయక్ మాట్లాడుతూ క్షణికావేశం, వివిధ రకాల తప్పిదాలనబడే కారణాల వల్ల జైలులో శిక్ష అనుభవిస్తున్న వారికి మానసిక ప్రశాంతత చేకూర్చేలా ఈ ప్లాట్ టీవీలు ఉపయోగపడతాయన్నారు. ఆధ్యాత్మిక పరమైన భక్తి చానెల్స్, వర్తమాన ప్రపంచ సమాచారాన్ని తెలిపే న్యూస్ చానల్స్ చూడటం ద్వారా మనోవికాసంతో జీవించాలని ఆమె ఆకాంక్షించారు. కార్యక్రమంలో జైలర్ ఉదయ్ భాస్కర్, డిప్యూటీ జైలర్ రామకృష్ణ, లక్ష్మణరావు శ్రీకాకుళం ఇస్కాన్ టెంపుల్ కమిటీ సభ్యులు ఉరిటి సత్యనారాయణ, హౌసింగ్ బోర్డ్ విశ్రాంత ఏఈ గౌరీ శంకర్, అధికారులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఖైదీలందరికీ మిఠాయి పంచిపెట్టారు.

## చెడు అలవాట్లు మానుకోండి

- రిటైర్డ్ రిజిస్ట్రార్ జి.తులసీరావ్ -

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జీవిత మార్గాన్ని చెడు అలవాట్ల నుంచి మార్చుకోవాలని విద్యార్థులకు స్థానిక వర్సిటీ రిటైర్డ్ రిజిస్ట్రార్ జి.తులసీరావ్ సూచించారు. సన్ డిగ్రీ పీజీ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించబడిన గ్రాహ్య (మేనేజ్మెంట్ ఫెస్ట్)లో విద్యార్థుల భవితవ్యం ఎలా నిర్ణయించుకోవాలి, మేనేజ్మెంట్ కోర్స్ ఆవశ్యకతని వివరించారు. కార్యక్రమంలో శ్రీకాకుళంలోని కళాశాలన్నీ పాల్గొన్నాయి. ముఖ్యఅతిథిగా హాజరైన స్థానిక వర్సిటీ రిజిస్ట్రార్ సుజాత నూతన శకానికి మేనేజ్మెంట్ కోర్స్ ప్రాముఖ్యతని వివరించారు. జిల్లా పారిశ్రామిక డైరెక్టర్ ఉమామహేశ్వరరావు, కళాశాల ప్రిన్సిపల్ పి.జయరాం, డైరెక్టర్ పి.మురళీకృష్ణ, ఎల్.కామేష్, స్టోర్ ఆఫ్ ఫౌండర్ హర్షవర్ధన్, చార్టెడ్ అకౌంట్ టి.తేజస్విని, కామర్స్ మేనేజ్మెంట్ స్టడీ హెచ్ఓడి పి.కుసుమలక్ష్మి, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉద్యోగాల నోటిఫికేషన్‌పై జాతీయ ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్ష ఈ నెల 23న విడుదల చేసిన టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగ భర్తీలో విడుదల చేసిన నోటిఫికేషన్‌పై జాతీయ షెడ్యూల్ తెగల కమిషన్‌కు ఆదివాసి సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వాబ యోగి ఫిర్యాదు చేశారు. ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్ష విడుదల చేసిన నోటిఫికేషన్‌లో ఆదివాసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని, ఈ నోటిఫికేషన్‌లో టీచింగ్ పోస్టులు మొత్తం 507 గాను ఆదివాసులకు 10 పోస్టులు మాత్రమే కేటాయించారని, రాజ్యాంగ ప్రకారం ఆదివాసులకు 6 శాతం రిజర్వేషన్ కల్పించాలని నిబంధనలు చెబుతున్నా అందుకు విరుద్ధంగా ఈ నోటిఫికేషన్ ఉందన్నారు. రాష్ట్రంలో లక్షల మంది ఆదివాసి నిరుద్యోగులుగా ఉన్నారని, డిగ్రీ, బీఈడి, పీజీలు, పూర్తిచేసి ఉద్యోగాల కోసం వేలాది రూపాయలు ఖర్చు చేసి కోచింగ్ సెంటర్లో శిక్షణ తీసుకొని ఉద్యోగ అవకాశాల కోసం ఎదురు




చూస్తున్న ఆదివాసీలకు ఈ ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నోటిఫికేషన్ రద్దు చేయమని పూర్తిగా విచారణ చేసి ఆదివాసీలకి రాజ్యాంగబద్ధంగా రావలసిన ఉద్యోగాలు కేటాయించాలని యోగి జాతీయ షెడ్యూల్ తెగల కమిషన్‌కు ఢిల్లీలో ఫిర్యాదు చేశారు.



# లెక్కల్లో ఒకటి.. సంపాదన రోజుకు కోటి

- ఇసుక డిమాండ్‌తో 'దేశం' నేతలకు కాసుల పంట
- వైకాపా బాటలోనే టీడీపీ కేడర్
- వాహనాలు సీజ్ చేసినా మారని సీన్
- సీజ్ చేసిన ఇసుకతో ప్రత్యేక దందా

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జిల్లాలో ప్రభుత్వ లెక్కల ప్రకారం ఒకే ఒక్క ఇసుక స్టాక్ పాయింట్ ఉంది. అదీ నారాయణపురం ఆనకట్టలో ఇసుక పూడికను తీసి బూర్జ మండలం కాఖండ్యాంలో స్టాక్‌పాయింట్‌కు చేర్చడం. అక్కడి నుంచే ఇటు రణస్థలం, అటు ఇచ్ఛాపురం వరకు సరఫరా చేయాలి. శ్రీకాకుళం రూరల్ మండలం, గారల్లో ఎటువంటి స్టాక్ పాయింట్లు, రీచ్‌లకు అనుమతి ఇవ్వలేదు. గారలో ఇటువంటి పూడిక తొలగింపునకే ఒక అనుమతి వచ్చినా, మాన్యువల్‌గా ఎత్తాలనే నిబంధన ఉండటం వల్ల లేబర్ ఛార్జి పెరిగి ఇసుక ధర ప్రభుత్వం నిర్దేశించిన మేరకు సరఫరా చేయలేమని, మిషిన్ల ద్వారా ఎత్తుకోడానికి అనుమతి కోరడంతో ఇక్కడి నుంచి ఎటువంటి తవ్వకాలు జరగడంలేదు. దీంతో కాఖండ్యాం ఒక్కడే లెక్కల ప్రకారం అధికారికంగా ఇసుకను విక్రయించే పాయింట్. కానీ గార మండలం బూరవల్లి, అంబళ్లవలసలో గతంలో అక్రమంగా తవ్వారని సీజ్ చేసిన ఇసుకను నెల రోజులుగా విశాఖకు వందల టన్నులు తరలించుకుపోతున్నారు. దీనిపై మొదటి నుంచి బూరవల్లి, అంబళ్లవలస, సాలిహుండం గ్రామాలకు చెందిన ట్రాక్టర్ల యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీన్ని చల్లార్చేందుకు స్థానిక టీడీపీ నాయకులు ట్రాక్టర్ల యజమానులకు డబ్బులు ఇవ్వడానికి ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇసుకను తరలించుకుపోయినా డబ్బులు ఇవ్వకపోవడంతో ప్రతిరోజు బూరవల్లి టీడీపీ నాయకుడు ఇంటికి డబ్బుల కోసం ట్రాక్టర్ల యజమానులు క్యూ కడుతున్నారని తెలిసింది. వాస్తవానికి ఇక్కడి నుంచి తరలిపోతున్న ఇసుక ఇక్కడిది కాదు. అప్పట్లో వంశధారకు ఆవలి వైపు ఉన్న నరసన్నపేట మండలం గోపాలపెంటకు నదిలో బాటలు వేసి ఇసుకను తవ్వి అక్కడి నుంచి బూరవల్లి ఒడ్డుకు తరలించి గుట్టలుగా వేశారు. ఇప్పుడు దీన్నే దశల వారీగా విశాఖకు రవాణా చేస్తూ వచ్చారు. గోపాలపెంట నుంచి బూరవిల్లి వైపు వేసిన ఇసుక పోగులు అక్రమమని రెవెన్యూ అధికారులు సీజ్ చేస్తే రైల్వే అవసరాల కోసమని ఒక అనుమతి కాగితం చూపించి అంతకు పదింతలు నిల్వలు తరలించుకుపోయారు.

జిల్లాలో డిమాండ్‌కు తగ్గట్టుగా సరఫరా లేనందున అక్రమార్కులకు జేబు నిండా డబ్బు చేరుతోంది. ఉచిత ఇసుక ఇస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నా అమలులో లోపాల కారణంగా అధిక ధరలకు ఇసుక కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఏ ఇసుక విధానమైతే గత ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసిందో, ఇప్పుడు అదే ఇసుకతో టీడీపీ నాయకులు తమ ప్రభుత్వానికి మచ్చ తెస్తున్నారు. ఇసుక డిమాండ్‌ను బట్టి డబ్బులు గుంజుతున్నారు. ప్రతి రోజు జిల్లాలో పదుల సంఖ్యలో లారీలను పోలీసులు సీజ్ చేస్తున్నారు. ఈ లెక్కన జిల్లాలో ఉన్న అన్ని ఒడ్డుల నుంచి భారీ మొత్తంలో ఇసుక అక్రమంగా రవాణా జరుగుతున్నట్టు అర్థమవుతుంది. జాతీయ రహదారికి సమీపంలో ఉన్న ఇసుక ర్యాంపుల్లో ఈ దందా మరింత ఎక్కువగా ఉన్నట్టు తెలుస్తుంది. ఒక ట్రాక్టర్ ఇసుక కావాలంటే డిమాండ్‌ను బట్టి రూ.5 వేల నుంచి రూ.6వేలు చెల్లిస్తున్నారు. 20 టన్నుల లారీకి రూ.6,700కు స్టాక్‌యార్ట్ వద్ద అధికారికంగా లోడ్ చేస్తున్నారు. అనధికారికంగా మరో 10 టన్నుల ఇసుకను అదనంగా లోడ్ చేస్తున్నారు. దీనికోసం అక్కడ సిబ్బంది రూ.వేలల్లో డబ్బులు వసూలు చేస్తున్నారు. 20 టన్నుల లారీ లోడ్ చేసి రోడ్డు మీదకు రావడానికి సుమారు రూ.30వేలు ఖర్చు చేస్తున్నారు. వీటిని విశాఖకు తరలించుకుపోయి రూ.70వేలకు విక్రయిస్తున్నారు.

జిల్లా పరిధిలో నాగావళి, వంశధార, బహుదా, మహేంద్రతనయ నదుల పరిధిలో 28చోట్ల ఇసుక అక్రమ తవ్వకాలు సాగుతున్నట్లు నిఘావర్గాల భోగట్టా. వీటిని ఆయా నియోజకవర్గాల పరిధిలో కూటమి నాయకుల కనుసన్నల్లో ట్రాక్టర్లు, లారీల్లో లోడ్ చేసి తరలించుకుపోతున్నారు. ఇసుక అక్రమ రవాణా చేయకుండా నిలువరించేందుకు ప్రభుత్వం చేస్తున్న చర్యలను టీడీపీ నాయకులే తూట్లు పొడుస్తున్నారు.

మంగళవారం ఉదయం బైరి రీచ్ నుంచి ఇసుకను అక్రమంగా తరలించుకుపోతున్న ట్రాక్టర్‌ను బైరి బస్టాండ్ వద్ద అక్కడ ఉన్న కానిస్టేబుల్ అడ్డగించి, డ్రైవర్‌తో బేరం కుదిరిన తర్వాత వదిలేసినట్లు స్థానికులు చెబుతున్నారు. అదే రోజు రాత్రి దూసి నుంచి వస్తున్న రెండు లారీలను సీజ్ చేశారు. అంతకు ముందు సోమవారం రాత్రి వన్ టౌన్ సీఐ రోడ్డు మీద కాపుకాసి భైరి నుంచి ఇసుక లోడ్‌తో విశాఖకు వెళుతున్న రెండు లారీలను పట్టుకొని రూరల్ పోలీస్ స్టేషన్‌లో పెట్టి కేసు నమోదు చేశారు. అలాగే కొత్తరోడ్డు వద్ద మూడు లారీలను అడ్డుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సీఐ రోడ్డు మీద కాపుకాసి అడ్డుకున్నారు కాబట్టి ఇసుకను విశాఖకు అక్రమంగా తరలించే లారీలు దొరికాయి. అధికారులు రోడ్డు ఎక్కితే తప్ప అక్రమంగా జిల్లా సరిహద్దులు దాటుతున్న ఇసుక లారీలను అడ్డుకోవడం లేదు. ఈ లెక్కన అనధికారిక ర్యాంపుల నుంచి ఎంత మొత్తంలో ఇసుక విశాఖకు తరలిపోతుందో అర్థమవుతుంది.

• ఎడిటోరియల్

# లెఫ్టిస్టుల సంబరాలు దేనికి?

'లెఫ్టిస్టులు సంబరాలు చేసుకోవడం ఆపండి.. శ్రీలంక ప్రెసిడెంట్ దిస్సనాయకే జేవీపీ (జనతా విముక్తి పెరమున) పార్టీకి చెందిన వ్యక్తి. అది ఒక కమ్యూనిస్టు పార్టీగా చెప్పుకుంటుంది. కానీ తమిళులు, ముస్లింలను ఏ మాత్రం పట్టించుకోదు. వారి అస్థిత్వ పోరాటాలను జేవీపీ ఏనాడూ గుర్తించలేదు. వాస్తవం చెప్పుకోవాలంటే దిస్సనాయకే ఒక సింహళ ఛావనిస్టు. మాజీ అధ్యక్షుడు మహింద రాజపక్స, ఆయన సోదరుడు గొటబాయ రాజపక్సలు ఈయన కంటే మితవాదులే.' ఇదీ రచయిత్రి, మార్క్సిస్టు, ఫెమినిస్ట్ అయిన కవితా క్రిష్ణన్.. ప్రముఖ జర్నలిస్టు ఆర్కే రాధాక్రిష్ణన్ రాసిన ఒక ఆర్టికల్‌ను ఉద్దేశిస్తూ పెట్టిన ట్వీట్. ప్రతీ ఎర్రజెండా కమ్యూనిస్టు పార్టీ కాదు. ఎర్రడ్రెస్సులు వేసుకుంటే లెఫ్ట్ కాదు. ది హిందూలో వచ్చిన ఆర్టికల్ ప్రకారం 2022లోనే 'వరల్డ్ సోషలిస్ట్ వెబ్ సైట్ - డబ్ల్యూఎస్‌డబ్ల్యూఎస్' ఇదే జేవీపీ లీడర్ అనుర కుమార దిస్సనాయకేను సింహళ ఛావనిస్టుగా పేర్కొన్నది. దాన్ని ఏకంగా ఆర్టికల్‌కు హెడ్‌లైన్‌గా పెట్టింది. ఇక ఫ్రంట్‌లైన్‌లో వచ్చిన ఆర్టికల్‌లో ముఖ్యంశాలు ఏంటంటే.. 2019లో జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో ఇదే దిస్సనాయకేకు కేవలం 3.2 శాతం ఓట్లు మాత్రమే వచ్చాయి. కానీ తాజాగా జరిగిన ఎన్నికల్లో మొదటి రౌండ్ కౌంటింగ్ ముగిసిన తర్వాత దిస్సనాయకే 42.31 శాతం ఓట్లతో ముందంజలో ఉన్నాడు. శ్రీలంక రాజ్యాంగం ప్రకారం అధ్యక్షుడిగా ఎన్నిక కావాలంటే 50 శాతం ఓట్లు ఉండాలి. దీంతో రెండో ప్రాధాన్యత ఓట్లను కూడా లెక్కించారు. అప్పుడు దిస్సనాయకే 50 శాతం ఓట్లను దాటేశాడు. శ్రీలంక చరిత్రలో రెండో ప్రాధాన్యత ఓట్లతో గెలిచి, అధ్యక్షుడైన మొదటి వ్యక్తి దిస్సనాయకేనే. వాస్తవానికి దిస్సనాయక వచ్చిన అవకాశాలను తనకు అనుకూలంగా మలుచుకొని కేవలం ఐదేళ్లలోనే పాపులర్ నాయకుడు అయ్యాడు. 2019 కరోనా తర్వాత శ్రీలంకలో పరిస్థితులు తలకిందులయ్యాయి. దేశంలో టూరిజం దెబ్బదినడంతో పాటు అప్పటి అధ్యక్షుడు గొటబాయ రాజపక్స పరిస్థితులను సరిగా మేనేజ్ చేయలేకపోయాడు. దీంతో ఎంతోమంది ప్రజలు.. పేదలుగా మారిపోయారు. ఒక్కసారిగా గొటబాయ ప్రభుత్వంపై ప్రజలు కోపం పెంచుకున్నారు. అప్పుడే జేవీపీ లీడర్ దిస్సనాయకే తనను తాను ప్రజల నాయకుడిగా చెప్పుకున్నాడు. వారి భాష మాట్లాడగలగడం.. వారితో కలిసిపోవడం.. ఆయనకు ఉన్న బలం. దీంతో వారి బాధలను దిస్సనాయకేతో షేర్ చేసకునేవాళ్లు. వారికి ఓదార్పు మాటలు చెప్పేవాడు దిస్సనాయకే. 2022లో దేశంలో ఆర్థిక సంక్షోభం ఏర్పడినప్పుడు ప్రజాగ్రహం పెల్లుబికింది. ప్రజల్లోంచి వచ్చిన ఆగ్రహాన్ని దిస్సనాయకే ఆపడానికి ప్రయత్నించలేదు. అంతే కాకుండా ఆ ఉద్యమాన్ని నడిపించాలని కూడా అనుకోలేదు. కానీ ఆ ఉద్యమానికి కావల్సిన దిశానిర్దేశనం మాత్రం దిస్సనాయకే చేశాడు. 2022 నుంచి 2024 మధ్య ప్రజలను ఆకర్షించడంలో నిమగ్నమయ్యాడు. నేను బయటి వ్యక్తిని(రాజకీయాలకు).. నేను మీ జీవితాల్లో గొప్ప మార్పు తీసుకొని రాగలను అంటూ ఉపన్యాసాలు దంచికొట్టాడు. అమెరికాలో ట్రంప్ ఎలాగైతే అవినీతిని అంతం చేస్తా (డ్రెయిన్ ద స్వాంప్), ఇండియాలో మోడీ ఎలాగైతే నల్ల ధనాన్ని రూపుమాపుతా, పది లక్షలు పంచుతా అంటూ ప్రజలను మభ్య పెట్టి అధికారంలోకి వచ్చారో.. అచ్చం అలాగే దిస్సనాయకే కూడా వాగ్దానాలు చేశాడు. అంతే కాదు.. ఆయన పీఆర్ స్టంట్లు కూడా అచ్చం మోడీలాగే ఉండేవట. తల్లిని ఆటోలో పోలింగ్ బూత్‌కు పంపడం.. తాను మాత్రం లగ్జరీ కార్లలో తిరగడం వంటి డ్రామాలు చేశాడట. దిస్సనాయకే తీరును ది యునైటెడ్ నేషనల్ పార్టీ కూడా ట్రోల్ చేసింది. తాను రాజకీయ నాయకుడిని కాదని.. బయటి వాడినని చెప్పుకున్న దిస్సనాయకే.. వాస్తవానికి 2001లోనే ఎంపీ అయ్యాడు. 2004-05లో అప్పటి ప్రెసిడెంట్ చంద్రిక కుమారతుంగ కేబినెట్‌లో వ్యవసాయ శాఖ మంత్రిగా కూడా పని చేశాడు. కానీ అప్పట్లో లోప్రొఫైల్‌లో ఉండి.. పెద్దగా పాపులర్ కాలేదు. కానీ ఇప్పుడు తాను బయటి వాడినని.. నీతిమంతుడినని చెప్పుకొని ఓట్లు దండుకున్నాడు. దిస్సనాయకేకు శ్రీలంకలోని ఏ తమిళ్ పార్టీ కూడా సపోర్ట్ చేయలేదు. ఎందుకంటే చంద్రిక కేబినెట్‌లో ఉన్న సమయంలో ఆయన తమిళ ఈలం (ఎల్టీటీఈ)తో కలిసి పని చేయాలని రూపొందించిన ఫార్ములాను వ్యతిరేకించాడు. అంతే కాదు.. సునామీ వచ్చి పోయిన తర్వాత.. ఘోరంగా దెబ్బతిన్న శ్రీలంక ఉత్తర, తూర్పు ప్రాంతాల్లోని తమిళులకు సహాయం చేయడాన్ని వ్యతిరేకించాడు. ఇతను మొదటి నుంచి తమిళులు, ముస్లింలు, ఇతర మైనార్టీ వర్గాలకు పూర్తి వ్యతిరేకంగా పని చేశాడు. 1987లో రాజీవ్ గాంధీ ప్రభుత్వం శ్రీలంకలో శాంతిని నెలకొల్పడానికి తమ వంతు సాయం చేయడాన్ని పూర్తిగా వ్యతిరేకించాడు. ఇతను మొదటి నుంచి ఇండియా వ్యతిరేకి. ముఖ్యంగా తమిళులు అంటే విపరీతమైన ద్వేషం నింపుకున్నాడు. అందుకే తమిళులు ఎక్కువగా ఉండే నార్త్‌లో, తమిళుల ప్రభావం ఉండే ఈస్ట్‌లో దిస్సనాయకేకు ఎక్కువ ఓట్లు పడలేదు. కేవలం సింహళ మెజార్టీ ప్రాంతాల్లోనే దిస్సనాయకేకు భారీగా ఓట్లు పడ్డాయి. మరో వైపు ఇతను ప్రో చైనా ఐడియాలజీ కలిగి ఉన్నాడు. కాబట్టి.. లెఫ్ట్ ఐడియాలజీ ముసుగులో శ్రీలంక ప్రెసిడెంట్ అయిన సింహళీ ఛావనిస్ట్ విజయాన్ని నిజంగానే సెలబ్రెట్ చేసుకోకూడదు.

# స్మాల్ సర్వీస్ టు సొసైటీ రూ.13 వేల సాయం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

బలగ, మడ్డివీధికి చెందిన కలివరపు సుశీల నడవలేని స్థితిలో, కుమార్తె ఊబకాయంతోపాటు థైరాయిడ్ సమస్యతో ఇబ్బంది పడుతున్నారని సమాచారంతో స్మాల్ సర్వీస్ టు సొసైటీ ద్వారా రూ.13 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. గురువారం బాధిత కుటుంబసభ్యులను కలిసి మిత్రబృందం, దాతల సహకారంతో ఆర్థికసహాయాన్ని అందించినట్టు సొసైటీ సభ్యులు తెలిపారు. దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి బాధిత కుటుంబానికి అండగా నిలవాలని కోరారు. ఆర్థికసాయం చేయదలచిన దాతలు స్మాల్ సర్వీస్ టు సొసైటీ ఫోన్‌పే నెంబర్ 9390610820కు జమ చేయాలని కోరారు. కార్యక్రమంలో స్మాల్ సర్వీస్ టు సొసైటీ సభ్యులు బరాటం భరత్ భూషణ్, జామి కిరణ్‌కుమార్ (బాలాజీ కిరణ్), పొట్నూరు సురేష్, కలివరపు సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

# బీజేపీ సభ్యత్వ నమోదులో జిల్లా టాపర్స్

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జిల్లాలో బీజేపీ ప్రాథమిక సభ్యత్వ నమోదు కార్యక్రమం మొదటి విడతలో మొదటి మూడుస్థానాల్లో పైడి రాజారావు, చల్లా వెంకటేశ్వరరావు, సిరిపురం తేజేశ్వరరావులు నిలిచారని ఆ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం జిల్లా కన్వీనర్, జాతీయ కౌన్సిల్ సభ్యుడు చల్లా వెంకటేశ్వరరావు తెలిపారు. ఈమేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 2నుంచి దేశవ్యాప్తంగా ప్రారంభమైన ప్రాథమిక సభ్యత్వ నమోదు కార్యక్రమం మొదటి విడత ఈనెల 25తో ముగిసిందన్నారు. రెండోవిడత అక్టోబరు 1న ప్రారంభమై 15వరకు కొనసాగుతుందన్నారు. 10 కోట్ల సభ్యత్వాల నమోదు లక్ష్యంగా ప్రారంభమైన ఈ కార్యక్రమంలో ఇప్పటికే 6 కోట్ల సభ్యత్వాలు నమోదు అయ్యాయని వివరించారు.

సభ్యునిగా నమోదు అవుతున్న వారి పూర్తి వివరాలతో, పూర్తిగా ఆన్లైన్ పద్ధతిలో నమోదు కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా గురువారం దేశవ్యాప్తంగా 48లక్షల మంది సభ్యత్వం తీసుకున్నారని తెలిపారు. సభ్యత్వ నమోదులో శ్రీకాకుళం అసెంబ్లీ నియోజకవర్గం రాష్ట్రంలో 6వ స్థానంలో నిలిచిందన్నారు. జిల్లాలో మొదటి మూడుస్థానాల్లో నిలిచిన పై ముగ్గురూ, రాష్ట్ర స్థాయిలో కూడా మొదటి పదిస్థానాల్లో నిలిచారని తెలిపారు.




# మైనర్ డ్రైవింగ్ చట్టరీత్యా నేరం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

మైనర్ డ్రైవింగ్ చేయడం చట్టరీత్యా నేరమని పోలీసులు పేర్కొన్నారు. మైనర్ డ్రైవింగ్ చేసి పట్టుబడితే జరిమానాతోపాటు పాటు వాహన యజమానిపై చర్యలు తీసుకోవాల్సి వస్తుందని విద్యార్థులకు అవగాహన కలిగించారు. బుధవారం స్థానిక చైతన్య జూనియర్ కలశాల, భారతీయ ఐటిఐ, టీపీఎం హైస్కూల్ విద్యార్థులకు మైనర్‌డ్రైవింగ్, రోడ్డు భద్రత నియమాలపై శ్రీకాకుళం వన్‌టౌన్ ఎస్సై హరికృష్ణ, ట్రాఫిక్ ఎస్సై వరదరాజులు, మహిళా పోలీసు స్టేషన్ ఎస్సై చంద్రకళ పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాన్ని నడపడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు.






నీ జ్ఞాపకాల నీడలలో నన్నెపుడో చూస్తావూ.. నను వలచావని తెలిసేలోగా నివురై పోతానూ!! ఎంత తప్పుగా అర్థం చేసుకున్నావు బాలూ..? జ్ఞాపకాల నీడలేంటీ? దశదిశలా కమ్మేసిన మానసిక ఆక్సిజన్ నువ్వు..! నిను వలచని మనిషెవ్వడు? నిన్నెవరు మరువగలరు..? మగవాడికోసం అసంఖ్యాక ప్రేమగీతాలు పాడావు, ఆడమనిషి కోసం "ఎటేపమ్మ ఒంటరి నడకంటూ" అన్నవై సుద్దులు చెప్పావు. తృతీయలింగపు "సూడు పిన్నమ్మా, పాడు పిల్లాడంటూ" పాటా పాడేశావు..! హాస్యగాడి కోసం "ముత్యాలూ వస్తావా..!" అన్నావ్..! దేశభక్తిని "జననీ జన్మభూమిశ్చ" పాడి ఉద్దీపన చేశావ్..! గిరిజనున్ని "కృషివుంటే మనుషులు ఋషులౌతారంటూ" మేల్కొలి పావు! శ్రామిక వనాల కోసం వసంతం తనంతట తానే తరలివ స్తుందని భరోసానిచ్చావు..! క్షుద్రులెరుగని రుద్రవీణని సాక్షాత్తూ పరమశివుడికే అవధరించి విని తరించమంటూ తాంబూలాలి చ్చేశావ్..! ఎన్ని గుండె లు జారుతున్నాయో ఊహించగలవా..? ఎన్ని కన్నీళ్ళు పారుతున్నాయో లెఖ్ఖెట్టగలవా..?

- గొట్టిముక్కల కమలాకర్

పిల్లాడు దారిన పడ్డాడ్లే.., వాడి దిగులేం పెట్టుకోకు. పని రాక్షసుడిలా అక్కడా రోజూ మూడుషిఫ్టులూ పాడేయకు. సుఖంగా, సుబ్బరంగా విశ్రాంతి తీసుకో..! సరస్వతీ దేవి తన ముద్దుల బిడ్డని చూసుకొని మురిసిపోతుంది. తన మావగారి పక్కనే ఓ రెండో శేషుడి పడకేయిస్తుంది. సుబ్బరంగా పడుకో..! ఆ గంధర్వుల సతీమణులు ఒక్కసారి నీ గొంతిన్నారంటే తినడం మానేసి పోటీపడి నీ కాళ్లొత్తుతూ సెటిలైపోతారు. "ఓ చిన్నదాన నన్ను విడిచిపోతావటే..!" అంటూ పాడాల్సిన అవసరమే రాదు. పైగా "నడిరాతిరిలోనా నీ పిలుపూ!" అంటూ వాళ్లే ఎదురుపాడినా దిక్కులేదు.

# నిను వలచని మనిషెవ్వడు?

బాలూ.. నీ పుణ్యాన ఎంతమంది పిల్లలు గాయకులయ్యారో తెలుసా..? ఎంత మంది నీ పేరు చెప్పుకుని కబళం తింటున్నారో ఊహించగలవా..? నీ మూలాన గాయకులు కాలేదని చెప్పుకుంటున్న పెద్దవాళ్లకన్నా కొన్ని వేలరెట్లు..! వాళ్లలో చాలామంది తమను తాము స్వర్ణభాండాల్లాగా భావించుకునే సత్తుగిన్నెలు..!నాకు సంతాపం చెప్పడం ఇష్టం లేదు బాలూ..! నీ కన్నా గొప్పగాయకులు పుంజీలుపుంజీలుగా ఉన్నారు. కానీ సినిమా పాట మాతృపెనిమిటి మాత్రం నువ్వే! మామనీ, ఎమ్మెస్వీనీ, ఘంటసాల మాస్టార్నీ, పంచమ్ దా నీ, వేటూరీ సినారే ఆత్రేయల్నీ అడిగినట్టు చెప్పు..! ఆ మహ్మద్ రఫీతో కావలసినన్ని పాటలు పాడించుకో..! సీతారావుడు సరిగ్గా కుదురుకున్నాడో లేదో కనుక్కో!

బాలూ..,

నీ ఒదిగిన మాట గురించీ, ఎదిగిన బాట గురించీ రంధ్రాణ్వేషకులూ, నిత్యశంకితులూ నిరంతరం తీర్పులిస్తూనే ఉంటారు. రికార్డింగ్ రూముల్లో నాదస్వర విన్యాసాలు తప్ప, రోడ్డు మీది సత్రకాయగాళ్ల సన్నాయి నొక్కులు వినే తీరిక నీకెప్పుడుండిందనీ?

నీ పాట గురించీ, గళవిన్యాసం గురించీ రెండో అభిప్రాయం లేదు బాలూ! అది సినిమాపాటకు తాతా, తండ్రీ, పెనిమిటీ, సోదరుడూ, కొడుకూ, మనవడూ! సంగీతమున్నంత కాలం, మానవజాతికి బధిరత్వం రానంతవరకూ నువ్వుంటావ్..! ఇప్పుడు కూడా ఎక్కడో భూతపు గొంతేసుకుని "ఓబాలా మసజసతతగా శార్దూలా..!" అంటూ ఫిల్ ఇన్ ద ట్యూన్ కూడా ఫీల్ తో పాడుతున్నావు..!

నీ ఇంటిపేరు శ్రీపతిపండితారాధ్యుల కావచ్చు కానీ, నిజానికి నువ్వు శ్రీపతిపామరారాధ్యుల వారివి. నాబోటి మాస్ గాడికి జతులూ, కృతులూ, శృతులూ,గతులూ ఏమర్థమవుతాయి చెప్పు..? నువ్వు "బంగారు కోడిపెట్టా వచ్చెనండీ" పాటలో ఓచోట "కుక్కుర్కూ..!" అంటావ్ చూడూ. అదీ నువ్వు! అందుకే నువ్వంటే మాకు లవ్వు!

"నాస్తితేషాం యశఃకాయే జరామరణ జంభయం" కదా..! నువ్వు అడ్డంగా నిలువెత్తు పాటవి..! ఆ నారదుడికీ, తుంబురుడికీ, గంధర్వులకీ ప్రవేటు తీసుకో..! ఆ శివయ్య ముందు భక్తకన్నప్ప కిరాతార్జునీయం పాట పాడు గానీ, ఆయనతో డాన్సులూ గట్రా చెయ్యమాక..! అసలే పర్సనాలిటీలో ఆయన పెద్దకొడుకు లాంటోడివి..!

ఇవాళేంటో మధ్యాహ్నం నుండి పూలు గుసగుసలాడటం లేదు., నవ్వులూ రువ్వడం లేదు. నువ్వు పాడని పుష్పవిలాపాన్ని పాడుతున్నాయి..! ఇవాళేంటో గాలి సైగలు చేయడం లేదు. నువ్వు పాడని పడవప్రయాణపు పాట పాడుకుంటోంది..!

బాలూ.. చాలాసార్లు చెప్పినట్టే ఇప్పుడూ చెబుతున్నా..! ఐ లవ్యూ!

ఇవాల్టి సంఘటన పట్ల నీగురించి నాకేం దిగుల్లేదు బాలూ..! నువ్వు పాడిన పాటల్ని ఇంకో రౌండ్ వింటే, తర్వాత నీ లైవ్ కాన్సర్టే వినొచ్చు! కానీ వృద్ధులైన నా తల్లిదండ్రులు పాడుతా తీయగా, స్వరాభిషేకం వదలకుండా చూస్తారు. వాళ్లేమవుతారో అని దిగులుగా ఉంది. అమ్మ హాస్పిటల్లో ఉంది బాలూ.. ఈ విషయం తెలియదు. తను నకిలీ స్టాంపుల కుంభకోణంలో తెల్గీని అరెస్టు చేసినప్పుడే "పాపం" అంటూ దిగులు పడింది. ఇదెలాగూ తెలుస్తుంది. తెలిసాక "ఏంటా..?" అని భయమేస్తోంది. నా కుటుంబంలో శాశ్వతసభ్యుడివి ఎందుకయ్యావు బాలూ?

తేరే మేరే బీచ్ మే కైసాహై యే బంధన్ అంజానా..!

మైనే నహీ జానా తూనే నహీ జానా!

ఎవరికెవరు ఈ లోకంలో ఎవరికి ఎరుకా..?

ఏ దారెటు పోతుందో ఎవరినీ అడగకా!

లేనిపోని భ్రమలెన్నో కలిగిస్తావూ..

మమ్ము తోలుబొమ్మలను చేసీ ఆడిస్తావూ..!

"ఋణానుబంధేన రూపేణ
పశుపత్నిస్సుతాలయః
ఋణక్షయే క్షయంయాంతి
కాతత్రపరివేదనా?"

అనేసి వదిలేద్దామంటే నువ్వా లిస్టులో లేవు. నీ ఋణం తీరదు..! "పెరుగుతుంది వయసనీ అనుకుంటారు, కాని తరుగుతుంది ఆయువనీ తెలుసుకోరు..!" ఎంత సరిగ్గా అర్థం చేసుకున్నావు బాలూ?

# ఇప్పుడిక.. రాజకీయ రంగు, రుచి, వాసన కూడా!!

## తిరుమలంటే ఆ ఇరుకు వీధులే గుర్తొస్తాయి!





**రమాకాంత్**

కరోనా ఫస్ట్ వేవ్ ముగిసిన తర్వాత 2021 జనవరిలో అనుకుంటా.. మిత్రులందరితో కలిసి తిరుపతికి వెళ్లా. అద్భుతం.. మేముంటున్న రూములన్నింటినీ మేఘాలు తాకుతూ ఆహ్లాదాన్ని పంచాయి. ఆ వాతావరణంలో కరోనాను జయించినట్టు చల్లని ఆ గాలిని గుండెల నిండా పీల్చుకుని చిన్నపిల్లల్లా పదేపదే మేఘాల గురించే చర్చించుకున్నాం. ఆ రాత్రి మేఘాలు మోసుకొచ్చిన మంచు అలా మా రూములపైనే వర్షించాయి. అలా తాకుతూ వెళ్లిపోయిన ఆ మేఘాలను చీల్చుకుంటూ నాకు కొన్ని వీధులు కనిపించాయి. అవి చాలా ఇరుకు సందులు. చాలా ఇరుకైనవి.. అచ్చం మురికివాడలకు ఏమాత్రం తక్కువ కాదు. ఆ ముందురోజు రాత్రి పైన ఫ్యాన్ గాలి శరీరాన్ని ఇబ్బంది పెడుతున్నా.. సాధారణమైన చలి మరింత వణుకు తెప్పిస్తున్నా.. రోజంతా తిరిగిన అలసట, ఫ్రెండ్స్‌తో గడిపిన ఉత్సాహం నిద్ర తీసుకొచ్చింది..

రూమ్ కాస్త దిగువగా ఉంది.. బాగా ఎత్తుగా ఉండే కొండ ఎగువ దిగువలు ఎక్కి దిగి ఆ వెదర్‌ని కాస్త ఎంజాయ్ చేశాం.. తిరుమలలో అలా ఇరుకుగా ఉన్న వీధుల గొడవేమిటో తెలుసుకుందామని మనసు పీకుతూనే ఉంది. శ్రీవారి దర్శనం చేసుకున్న తర్వాత అక్కడ చూడాల్సినవి ఏముంటాయో తెలుసుకుందామని ఓ చోట ఆగాం.

భక్తులకు తిరుమల విశేషాలు చూపించడానికి రెడీగా ఉన్నారు నలుగురైదుగురు డ్రైవర్లు. మాటల్లో పెట్టి మురికివాడలు తలపిస్తున్న ఆ వీధుల సంగతి అడిగా.. అది ఊరని, కాలక్రమేణా ఇది దేవుడి ఊరుగా మారిందని, అందరూ తరతరాల నుంచి అక్కడే ఉంటారని చెప్పాడు. కాస్త ఆశ్చర్యంగా అనిపించింది ఎవరుంటారన్నా.. అమాయకంగా చూసి ఈ ఊరివాళ్లే అన్నాడు. మరి చనిపోతే వీళ్ల దహన సంస్కారాలు ఎక్కడ చేస్తారని అడిగా.. ఇక్కడే అన్నాడు. అర్థమైంది. మరింత లోతుల్లోకి వెళ్లలేదు. అప్పటికే ఆరేడు సార్లు తిరుమల తిరి గాను. ఎప్పుడూ కనిపించని ఆ చోటు ఆరోజు కంటపడింది.




ఆ ఊరి పేరు తిరుమల.. దేవుడు ఆ ఊరిని ఆక్రమించాడు.. అపవిత్రమని కాళ్లకు చెప్పులు కూడా తొడుక్కోకుండా ఎక్కడి నుంచో వచ్చిన భక్తులందరూ ఆ వీధుల్లోనే తిరుగుతారు. ఏడు కొండలను పరమ పుణ్య క్షేత్రంగా మార్చిన పరిణామ క్రమం కంటే సుదూరమైన ఏ ఏడు కొండలు ఎక్కి, ఆ అడవిలో ఊరు నిర్మించుకున్న వాళ్ల తాతముత్తాతల శ్రమకు జోహార్లని మనసులోనే అనుకున్నా. మళ్లీ దేవుడున్నాడని అక్కడ ఊరు తయారైందా.. లేకపోతే అన్నన్ని తరాలుగా ఇంత ఎత్తులోకి వచ్చి ఊరు కట్టుకొంటారా? మరో సందేహం వెంటాడింది. గతంలో ఊరు పెద్దది.. గుడి చిన్నది. ఇప్పుడు గుడి పెద్దదై ఊరు ఇరుకైందని మాత్రం అర్థమైంది.

తిరిగొస్తున్నప్పుడు నా కోటా లడ్డూలు ఇవ్వకుండా మా మిత్రులు కొట్టుకుంటున్నారు.. నేనే తక్కువ తీసుకుంటా అని నాతో పాటే వచ్చిన ఓ ముస్లిం మిత్రుడికి ఉన్న లడ్డూలు సమానంగా పంచాను. పెద్ద ఎమోషన్ లేదు. స్వామివారి ప్రసాదం మామూలుగానే ఉంది. నాకున్న దిగులల్లా ఆ స్వామి ఆ ఊరిని ఇరుకైన వీధులుగా మార్చకపోతే ఎంత బావుండేదో అనే!

తిరుమలలో, తిరుపతిలో ఉండే ప్రతిఒక్కరికి ఆ విషయం తెలుసనే అనుకుంటున్నా. ఆ ఊరు దేవుడి పేరు మీద కుచించుకుపోయిందని. మాస్టర్ ప్లాన్‌లో భాగంగా ఆ ఊరి వాళ్లని మరో చోటికి తరలించారు. వెళ్లలేనివాళ్లు అలా ఆ వీధుల్లో నివాసముంటున్నారు. దాదాపు వెయ్యి ఓట్లు ఉన్నాయని తెలిసింది.

ఇక తిరుమల లడ్డూ తయారీలో బూందీ, ఇతర ఇంగ్రీడియెంట్స్ మిక్సింగ్ మేన్ మేడ్ కాదు. మెషీన్ మేడ్! తర్వాత దశలో చేత్తో కలిపితే లడ్డూ తయారవుతుంది. అంతకుముందు దర్శనం టికెట్ మీద రెండు ఇచ్చేవాళ్లు. దానికే బ్లాకులు, వైటుల్లో అమ్మేవాళ్లు. జగన్‌మోహన్‌రెడ్డి వచ్చిన తర్వాత లడ్డూ ప్రొడక్షన్ పెంచారు. దర్శనం, టికెట్ లేకుండానే ఎన్ని కావాలంటే అన్ని తీసుకోవచ్చు. ఆ వెసులుబాటు కల్పించారు. అందుకే అప్పుడెప్పుడో ఉన్న రుచి ప్రొడక్షన్ పెంచిన తర్వాత తగ్గిందనేది వాదన. ఇక రోజుకో లక్ష ఖర్చు పెట్టి ఆవునెయ్యి తెప్పించి స్వామివారి నైవేద్యం కోసం చేసే లడ్డూలు మాత్రం వీవీఐపీలకే దక్కుతాయనుకుంటా! ఆ రుచి సామాన్యమైన జనానికి ఎక్కడ దొరుకుతుంది?




టీవీ ఛానల్స్‌లో కనిపించే వీవీఐపీలందరూ రుచి గురించి మాట్లాడరు. మనలాగా యాభై రూపాయల లడ్డూల కోటా కాదది. లక్ష రూపాయల కోటా వాళ్లవి. కొట్లాటలు పెడతారంతే. అగ్గి రాజేసి చలి కాచుకుంటారంతే. ఇప్పుడు తిరుపతి లడ్డూకి నెయ్యి, జీడిపప్పు కంటే రాజకీయ రంగు, రుచి, వాసనను ఎక్కువ కలిపేశారు. భక్తుల మనోభావాలు మట్టిగడ్డలు చేసి మరీ చెలరేగుతున్నారు.

తాజా పరిణామాల నేపథ్యంలో తిరుమలలో మేఘాలు చీల్చుకుని కనిపించిన ఆ ఇరుకు వీధులే ఎక్కువ గుర్తొస్తున్నాయెందుకో నాకు. అన్నింటికంటే విషాదం ఏంటంటే మాతోపాటు తిరుమలకు వచ్చిన మిత్రుడు ఆ తర్వత ఏడాదికి అనారోగ్యంతో అందరినీ విడిచి వెళ్లిపోయాడు. ఆ రెండు రోజులు మాకంటే ఎక్కువ యాక్టివ్‌గా కనిపించాడు. అందుకేనేమో దాదాపు నాలుగేళ్లయినా మళ్లీ ఆ కొండపైకి అంత ఆసక్తిగా వెళ్లాలనిపించట్లా.

## నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వెల్లడించారు. గుడివీదిలోని ఉమారుద్ర కోటేశ్వర స్వామి ఆలయం వద్ద నాగావళి తీర ప్రాంతంలో స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో శాసనసభ్యులు గొండు శంకర్, ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌లతో కలసి ఆయన గురువారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నాగావళి, వంశధార నదుల పరిశుభ్రత పరిరక్షణ కోసం ప్రతీ ఒక్కరూ చిత్తశుద్ధితో కృషి చేయాలని కోరారు. నగరంలో అన్ని ప్రాంతాల నుంచి వచ్చే మురుగునీటిని ఒకే ప్రాంతానికి చేర్చి దానిని శుభ్రపరచి నదిలో వదిలే విధంగా చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. ఇందుకు నిధులు, భూమిని కూడా కేటాయించినట్లు చెప్పారు. అన్ని ప్రాంతాల నుండి సేకరించిన చెత్తను రివర్‌వ్యూ పార్క్ దగ్గరలో డంప్ చేస్తామన్నారు. సేకరించిన చెత్తను విశాఖపట్నంలో గల వేస్ట్ మేనేజ్మెంట్‌ప్లాంట్‌కు తరలిస్తామన్నారు. రోడ్లపైన, కాలువల్లో చెత్త వేస్తున్నారన్నారు. ప్రజలు గమనించి నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించి క్లీన్ అండ్ గ్రీన్‌లో మంచి ర్యాంకు సాధించాలన్నారు.

**నాగావళి గట్టు మీదుగా రోడ్డు**

ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ నాగావళి, వంశధార నదుల పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందన్నారు. నాగావళి గట్టుపై నుంచి రోడ్డు ఏర్పాటు చేసి నగరవాసులు నడచుకోడానికి, సైక్లింగ్, వాహనాలను డైవర్ట్ చేయడారికి వీలుగా ప్రతిపాదనలు సిద్ధం చేసినట్టు తెలిపారు. దేశంలో స్వచ్ఛ నగరాల జాబితాలో శ్రీకాకుళం ఉండాలనేది లక్ష్యమన్నారు. శ్రీకాకుళం నగరంలో నాగావళి నది ప్రవహించే ఒడ్డున సుందరమైన పార్కులు, చక్కని రహదారి ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. నగరంలోని మిర్తిబట్టి పనులను పున:ప్రారంభిస్తామన్నారు. ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా తడి, పొడి చెత్తలను వేరు చేసి ఇంటి వద్దే ఉంచితే పారిశుధ్య కార్మికులు వచ్చిన తర్వాత వారికి అందజేయాలన్నారు. పోలీసు స్టేషన్‌లో కూడా పరిశుభ్రత కార్యక్రమాన్ని ప్రారంభించినట్టు తెలిపారు. అనంతరం పార్కులో మొక్కలు నాటి పెయిటింగ్‌లో పాల్గొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ పివివిడి ప్రసాదరావు, జిల్లా పరిశ్రమల జనరల్ మేనేజర్ ఉమా మహేశ్వరరావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి. మీనాక్షి, ఫీల్డ్ పబ్లిసిటీ అధికారి బి.తారకప్రసాద్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ బి.కరుణశ్రీ, రిటైర్డ్ ఆర్డీఓ పిఎంజె బాబు, ఇతర అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులు పాల్గొన్నారు.



## 27న పీవోడబ్ల్యూ జిల్లా మహాసభలు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఈనెల 27న ఇలిసిపురంలోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విజ్ఞాన మందిరంలో ప్రగతిశీల మహిళా సంఘం (పిఓడబ్ల్యు) శ్రీకాకుళం జిల్లా 7వ మహాసభలను నిర్వహిస్తున్నట్టు జిల్లా కార్యవర్గం ప్రకటించింది. గురువారం బలగలో ఉన్న పీవోడబ్ల్యూ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షురాలు సవలాపురపు కృష్ణవేణి అధ్యక్షతన నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆమె మాట్లాడారు. మహాసభలను పీవోడబ్ల్యూ ఏపీ రాష్ట్ర అధ్యక్షురాలు ఆర్.గంగాభవాని, ప్రధాన వక్తగా పీవోడబ్ల్యూ ఏపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, యం.లక్ష్మి, వక్తలుగా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పి.రమణి, రాష్ట్ర కార్యదర్శి పి.పద్మ, పీవోడబ్ల్యూ శ్రీకాకుళం జిల్లా కమిటీ ప్రధానకార్యదర్శి పోతనపల్లి కుసుమ, పీవోడబ్ల్యూ శ్రీకాకుళం జిల్లా కార్యవర్గసభ్యులూ మాట్లాడుతారని తెలిపారు. ప్రగతిశీల మహిళా సంఘం అర్థ శతాబ్ద కాలంగా ప్రజల కోసం, ప్రత్యేకంగా మహిళల కోసం పనిచేస్తోందన్నారు. 1974లో ఉస్మానియా విశ్వవిద్యాలయం విద్యార్థినుల చొరవతో ఆర్భవించిన పీవోడబ్ల్యూ మొదటగా మహిళలపై వేధింపులకు, అసభ్య సాహిత్యానికి, వరకట్న హత్యలకు వ్యతిరేకంగా తన కార్యక్రమాలను ప్రారంభించిందన్నారు. మహాసభలో పలు ప్రజాసంఘాల నాయకుల సందేశాలు, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలూ ఉంటాయన్నారు. పలు తీర్మానాలను మహాసభ చర్చించి ఆమోదిస్తుందన్నారు. సభా ప్రారంభానికి ముందుగా ఉదయం 9గంటలకు శ్రీకాకుళం ఆర్టీసీ బస్టాండ్ నుండి ఊరేగింపు ప్రారంభమవుతుందన్నారు. సమావేశంలో పీవోడబ్ల్యూ జిల్లా నాయకులు కుత్తుం హేమక్క, బర్ల జానకి, కె.జానకమ్మ, అప్పన్నమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## వరద బాధితులకు ఆంధ్రప్రభ విరాళం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

విజయవాడ వరదలతో సర్వం కోల్పోయిన బాధితుల సహాయార్థం ఆంధ్రప్రభ తరపున బుధవారం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ ధినకర్ పుండ్కర్‌కి కలెక్టరేట్‌లో కలిసి రూ. 25వేలు చెక్కును అందజేసారు. కలెక్టర్‌కు చెక్కు అందజేసినవారిలో జిల్లా పౌర సంబంధాల అధికారి కె బాలమన్‌సింగ్, అంధ్రప్రభ బ్యూరో, మేనేజర్ మంగిపూడి కాళిదాస్, ఉరిటి చంద్రశేఖర్, రణస్థలం, లీగల్ రిపోర్టర్లు కొన్ని వెంకటరావు, జల్లు తిరుపతిరావు ఉన్నారు.



SriAaKaSa
YOUR TRUSTED PARTNER IN THE DISTANCE EDUCATION SECTOR.
Join our Earn while Learn program and get a job within 40 days after joining.
LAST DATE: AUGUST-28
91330 06999 Courses 92466 36411
10th, Intermediate
BA (all groups), B.Com, BLISc, B.SC (all groups), BBA, BCA (with Market trending specialisations)
MA (all subjects), M. Com, MBA, MCA, M. SC (All Subjects), MLISc, M.Tech
Computer Applications, Cyber Security, Digital Marketing, Hospital Management, Tourism Management

ఎం.ఇర్షాద్
USHA ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్..
అన్ని రకాల సెవింగ్ మిషిన్లు, ఫేషన్ మేకర్స్, ఎంబ్రాయిడరీ మిషిన్లు, స్పేర్స్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

SAI OPTICIANS
సరస్వతి మహల్ ఎదురుగా, శ్రీకాకుళం
ప్రొప్రయిటర్: బి.రమణమూర్తి
సెల్: 94407 59739
బ్రాంచ్ ఆఫీస్: గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, శ్రీకాకుళం, సెల్: 94407 59739

MNM
బెంగుళూర్ అయ్యంగార్ బేకరి
BSNL ఆఫీస్ ప్రక్కన, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
సెల్: 76759 18522

మెట్రో సోఫా వర్క్
అన్ని రకముల సోఫాలు, ఫర్నిచర్ మేనుఫేక్చర్స్ (హోల్‌సేల్ & రిటైల్)
షాపు నెంబరు 1, కొన్నవీధి, వన్‌వే ట్రాఫిక్ రోడ్డు, మాధవ మోటార్స్ దరి, శ్రీకాకుళం
సెల్: 83094 81129

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రొ॥ వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

జై శ్రీమన్నారాయణ
శ్రీ క్రిష్ణ ఆన్‌లైన్ సర్వీసెస్
మావద్ద అన్ని రకముల జాబ్ అప్లికేషన్స్ ఆన్‌లైన్ చేయబడును.
సెల్: 93938 41308
రైల్వే రిజర్వేషన్లు, బస్ రిజర్వేషన్ సదుపాయం కలదు.

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
NEAR SURYA MAHAL THEATRE WOMEN'S COLLEGE ROAD, SRIKAKULAM - 532 001

# ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు



(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఐదేళ్లు పరదాల మాటున తిరిగిన జగన్ ప్రజల్లోకి వచ్చి తిరుగుతామంటే తమకెలాంటి అభ్యంతరం లేదన్నారు. సూపర్ సిక్స్ పథకాన్ని చిత్తశుద్ధితో అమలుచేయడానికి కట్టుబడి ఉన్నామన్నారు. ఆయాలకు వేతన బకాయిలు ఉన్నాయని, వాటిని త్వరితగతిన మంజూరు చేయడానికి చర్యలు చేపట్టామని, నాడు-నేడు పథకాన్ని వైకాపా ప్రభుత్వం ప్రారంభించి మధ్యలోనే నిలిపేసిందన్నారు. దీనికి సంబంధించి జిల్లాల నుంచి వచ్చిన నివేదికలను పరిశీలిస్తున్నామని, దీన్ని ఏ విధంగా ముందుకు తీసుకువెళ్లాలో ఆలోచన చేస్తున్నామన్నారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో సూపర్ సిక్స్‌లో మూడు అమలు చేశామని, ఉచిత గ్యాస్ సిలిండర్ పథకాన్ని దీపావళి నుంచి అమల్లోకి తీసుకువస్తున్నామన్నారు. సూపర్ సిక్స్ పథకాలను అధికారంలోకి వచ్చిన వందరోజుల్లో అమలు చేస్తామని ఎక్కడా చెప్పలేదన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గొండు శంకర్, ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.







# వంద రోజుల్లో ఎన్నో ఘనతలు

- మత్స్యకారులకు అండగా నిలుస్తాం
- కేంద్ర మంత్రి రాము, రాష్ట్రమంత్రి అచ్చెన్న
- మంచినీళ్ల పేటలో ఇది మంచి ప్రభుత్వం



(సత్యంన్యూస్, పలాస)

పదవులు శాశ్వతం కాదని, చేసిన మంచి పనులు శాశ్వతమని, మత్స్యకారులకు అండగా నిలుస్తామని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. వజ్రపుకొత్తూరు మండలం మంచినీళ్లపేటలో నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. ఉద్దానం ప్రాంతానికి ప్రత్యేకంగా ఉద్యానవన శాఖ ఏడీ కార్యాలయం ఏర్పాటు చేశామని, పాడేరు తరలిపోయిన కార్యాలయాన్ని 100 రోజుల్లో తెప్పించుకున్నామని తెలిపారు. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ అంధకారంలోకి వెళ్లిన రాష్ట్రాన్ని కూటమి ప్రభుత్వం తిరిగి వెలుగులోకి తెచ్చిందని, వంద రోజుల పాలనలో ఎన్నో ఘనతలు సాధించామని అన్నారు. ఎన్ని కష్టాలు వచ్చినా ఎన్ని సమస్యలు వచ్చినా ప్రజలకు మేలు చేసే ప్రభుత్వం కూటమి ప్రభుత్వమని అన్నారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ గత 100 రోజుల్లో మెరుగైన లక్ష్యాలను చేరుకున్నామని చెప్పారు. 15వ ఆర్థిక సంఘ నిధులు విడుదలయ్యాయని, మంచి పనులు చేపట్టాలని కోరారు. ఎమ్మెల్యే గౌతు శిరీష మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన 30 రోజుల్లోనే వంశధార నీటిని పలాస, వజ్రపుకొత్తూరుకు తీసుకు వచ్చి పని చేసే ప్రభుత్వమని నిరూపించుకున్నామన్నారు.



తుఫాన్ కారణంగా గురువారం కురిసిన వర్షాలకు డిఎస్పీ కార్యాలయం నుంచి మున్సిపల్ కార్యాలయం మీదుగా ఏడురోడ్ల కూడలి వరకు చేరిన వర్షపునీటిని ఎమ్మెల్యే గొండు శంకర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రసాదరావు, సిబ్బంది పాల్గొన్నారు.


– సత్యంన్యూస్, శ్రీకాకుళం



పలాస నుంచి టీటీడీకి వెళుతున్న జీడిపప్పు వాహనాన్ని గురువారం కేంద్ర, రాష్ట్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, కింజరాపు అచ్చెన్నాయుడులు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ గత ఐదేళ్ల ప్రభుత్వ పాలనలో నాణ్యత లేని జీడిపప్పును వినియోగించారన్నారు. ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వంలో టీటీడీలో లడ్డూ ప్రసాదానికి గానూ పలాస నుంచి నాణ్యమైన జీడిపప్పును పంపిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గౌతు శిరీష తదితరులున్నారు.

– సత్యంన్యూస్, పలాస

# జీబీఎల్ ఆధ్వర్యంలో రక్తదానం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

గౌద్దు భాగ్యలక్ష్మి పుట్టినరోజు సందర్భంగా జీబీఎల్ ఫౌండేషన్ ఆధ్వర్యలో డే అండ్ నైట్ జంక్షన్‌లోని విజయశ్రీ బ్లడ్ బ్యాంక్‌లో స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించారు. ఇందులో 20 పాయింట్ల వరకు దాతలు రక్తదానం చేశారు. కార్యక్రమంలో భాగ్యలక్ష్మి కుమారుడు రెడ్డి సూర్యప్రసాద్, జిల్లా అధ్యక్షులు బిర్లంగి ఉమా మహేశ్వరరావు, రాష్ట్ర అధికార ప్రతినిధి పూడి తిరుపతిరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు శవ్వాన ఉమామహేశ్వరి, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యులు అట్టాడ రవి బాబ్జి, రాష్ట్ర మహిళా మోర్చా కార్యవర్గ సభ్య రాలు సూర్యకుమారి, ఓబీసీ మోర్చా అధ్యక్షులు కరుణాకర్ గొలివి, ఓబీసీ మోర్చా స్టేట్ కో-కన్వీనర్ సురేష్ బాబు సింగ్, శ్రీకాకుళం జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ దుర్గారావు గాంధీ, నార్త్ మండల అధ్యక్షులు పూజ చెల్లయ్య, సౌత్ మండల అధ్యక్షులు సోమేషన్, సౌత్ మండల ప్రధాన కార్యదర్శి ఎస్.సరళ తదితరులు పాల్గొన్నారు.


# అద్దెకొరకు

శ్రీకాకుళంలో డే అండ్ నైట్ జంక్షన్ వద్ద గల లయా ల్యాబ్ బిల్డింగ్‌లోని ఫస్ట్‌ఫ్లోర్, సెకండ్ ఫ్లోర్ (22X150) కామన్ హాల్ మెడికల్ హోల్‌సేల్ షాపులకు గాని, డాక్టర్ ప్లాజాకు గాని, ఆఫీసులకు గాని అద్దెకు ఇవ్వబడును.

- సంప్రదించవలెను -

94403 72300, 98487 96626


# రూ.25లక్షల పరిహారం అందజేయాలి



(సత్యంన్యూస్, రణస్థలం)

పాతర్లపల్లి పాఠశాల భవనం షన్‌షేడ్ కూలి పదవతరగతి విద్యార్థి కృష్ణంరాజు మృతి చెందడం బాధాకరమని, విద్యార్థి కుటుంబానికి ప్రభుత్వం 25లక్షల రూపాయలు పరిహారం ఇవ్వాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.చందు, బి.హరీష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం పాతర్లపల్లి ఉన్నత పాఠశాలలో సంఘటన స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం అనంతరం పాతర్లపల్లి తీసుకువచ్చిన విద్యార్థి కృష్ణంరాజు మృతదేహం వద్ద ఎస్.ఎఫ్.ఐ నాయకులు, సిఐటియు జిల్లా అధ్యక్షులు సి.హెచ్. అమ్మన్నాయుడు నివాళి అర్పించి కుటుంబ సభ్యులకు తమ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్యం కారణంగానే విద్యార్థి చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ కుమారుడు బాగా చదువుకుని ఉన్నతస్థానంలో ఉంటాడని తల్లిదండ్రులు ఎన్నో కలలు కన్నారని, కాని తమ బిడ్డ అందనంత దూరాలకు వెళ్లిపోవడంతో గుండెలు విలపించేలా ఏడుస్తున్న తల్లిదండ్రుల బాధ వర్ణనాతీతమన్నారు. ఇదే సంఘటనలో తీవ్ర గాయాలు పాలై ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థి కోరాడ శ్రీరామ్‌ను పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ఏ పాఠశాలలో కూడా ఇటువంటి సంఘటనలు జరగకుండా ప్రభుత్వం యంత్రాంగం పకడ్బంది చర్యలు తీసుకోవాలని కోరారు. వీరితో పాటు ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సంతోష్ ఉన్నారు.

# కేంద్ర విశ్వవిద్యాలయాల అభివృద్ధికి నిధులు కేటాయించాలి




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రాష్ట్రంలో గల కేంద్ర విశ్వవిద్యాలయాల అభివృద్ధికి నిధులు కేటాయించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వి.జాన్సన్‌బాబు డిమాండ్ చేశారు. విజయనగరంలో జరుగుతున్న ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర 49వ మహాసభకు సంబంధించి కరపత్రాలు స్థానిక శ్రీకాకుళం జిల్లా క్రాంతిభవన్‌లో గురువారం నిర్వహించిన పత్రికా సమావేశంలో ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యారంగంలో నెలకొన్న సమస్యలను ఈ మహాసభల్లో చర్చించనున్నామన్నారు. ప్రధానంగా రాష్ట్రంలో ఉన్న కేంద్ర విశ్వవిద్యాలయాల పట్ల చిన్నచూపు చూడడం సరైనది కాదన్నారు. రాష్ట్రం విభజన నేపథ్యంలో రాష్ట్రానికి మూడు విశ్వవిద్యాలయాలు కేంద్రసంస్థల స్వయం ప్రతిపత్తి గల 20 సంస్థలు వచ్చాయన్నారు. విశ్వవిద్యాలయాలకు సంబంధించి పూర్తిస్థాయి స్థలం సొంత భవనాలు, సరిపడే వసతులు, పోస్టులు భర్తీ చేయకుండా కోర్సులు పెంచకుండా కాలయాపన చేయడం జరుగుతోంది.ఉన్నత చదువులు చదువుకోవడం కోసం విద్యార్థులు ఇబ్బందులు గురవుతున్నారు. ఈ సందర్భంలో రాష్ట్రంలో పేద విద్యార్థికి ఉన్నత విద్య దూరమయ్యే పద్ధతిలో ప్రభుత్వాలు వ్యవహరించడం సరైనది కాదు అని అన్నారు .నూతనంగా ఏర్పడినటువంటి ఎన్డీఏ ప్రభుత్వం తక్షణమే స్పందించాలి కేంద్ర మంత్రివర్యులు కింజారపు రామ్మోహన్ నాయుడు గారు స్పందించి కేంద్ర విద్యా శాఖ మంత్రి తో చర్చించి పూర్తిస్థాయిలో నిధులు కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సిహెచ్ రవి, నాయకులు పూర్ణ సాయి,జోగేంద్ర ప్రసాద్,సూర్య కిరణ్,భాను ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.


## ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట
# నూతన సంఘం ఏర్పాటు

(సత్యంన్యూస్, కవిటి)

స్థానిక చింతామణి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో గురువారం కవిటి మండలం ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట నూతన సంఘం ఏర్పాటైంది. ఇచ్ఛాపురం నియోజక వర్గం ఎస్సీ వర్గీకరణ పోరాట సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ సంఘంలో అధ్యక్షులుగా బాగ వేణు, ప్రధాన కార్యదర్శిగా మద్దిలి కేశవరావు, ఉపాధ్యక్షులుగా జడ్డిడి లింగరాజు, బలగ ధర్మారావు, పందిరి కేశవరావు, పాటి కుమార్, సహాయ కార్యదర్శులుగా దడ్డ ధర్మారావు, మురిడి సుధాకర్, దుండంగి జీవన్‌లను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షులుగా దుండంగి వాసు, గౌరవ సలహాదారులుగా దీపాల జగన్నాయ కులు, బాగ నందేశ్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నియోజక వర్గ ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక సంఘ అధ్యక్ష, కార్యదర్శులు సల్ల దేవరాజు, పందిరి లోకేష్, ఉపాధ్యక్షులు డొప్ప వెంకటరావు, నూతలపాటి బాబూరావు, కన్వీనర్ బుస్కల ఈశ్వరరావు, వంకిల కేశవరావు, కొప్పల హేమంత్, కొక్కిరి రాజు, రవి, సంఘ నాయకులు పాల్గొన్నారు.



# ఎంపీ కలిశెట్టికి టీడీపీ శాశ్వత సభ్యత్వం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

విజయగనరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు రూ.లక్ష చెల్లించి టీడీపీ శాశ్వత సభ్యత్వాన్ని పొందినట్టు గురువారం ఆయన తెలిపారు. ఉత్తరాంధ్ర పర్యటనకు వచ్చిన పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌కు పార్టీ శాశ్వత సభ్యత్వం కోసం రూ.లక్ష చెక్కును పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్ సమక్షంలో కలిశెట్టి అందజేశారు. అనంతరం విలేకరులతో అప్పలనాయుడు మాట్లాడుతూ చెక్ ఇచ్చిన సందర్భంలో తనదే తొలి శాశ్వత సభ్యత్వం అని లోకేష్ చెప్పారన్నారు. ఒక సామాన్య కార్యకర్తకి ఎంపీగా అవకాశం ఇచ్చి పార్లమెంటుకు పంపించిన పార్టీకి నా జీతంలో రూ. లక్ష ఇవ్వడం ఎంతో సంతృప్తి నిచ్చిందన్నారు. కష్టపడే కార్యకర్తలకు ఎన్నో అవకాశాలు ఇస్తున్న పార్టీ కలకాలం బాగుండాలని కోరుకుంటున్నట్టు తెలిపారు. తన మాదిరిగా ఎంతమంది కార్యకర్తలు చట్టసభల్లోకి రావాలని, గౌరవం పొందాలనే ఆలోచనతో మొదటి శాశ్వత సభ్యత్వం తీసుకోవడం జరిగిందన్నారు. అక్టోబర్ 2 నుంచి మొదలయ్యే సభ్యత్వాలు నమోదు ఒక పండగ వాతావరణం తలపిస్తుందన్నారు. విజయవాడ వరదల కష్టకాలంలో మేమున్నామంటూ నిలబడిన పార్టీ కార్యకర్తలకు, అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. కష్టపడే కార్యకర్తలకు గుర్తింపు ఇస్తున్న పార్టీలో అందరూ సభ్యత్వం తీసుకోవాలని కోరారు.

# విద్యార్థి దుర్మరణంపై నివేదిక అందించండి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రణస్థలం మండలం పాతర్లపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం పదో తరగతి విద్యార్థి వనం కృష్ణంరాజు స్కూల్ పైభాగాన గల సన్‌సైడ్ కూలి మృతిచెందిన దుర్ఘటనపై తక్షణమే నివేదిక అందించాలని కలెక్టర్, విద్యాశాఖ అధికారులకు ఆదేశించినట్టు ఏపీ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం తెలిపారు. గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. దురదృష్టకర సంఘటనపై కమిషన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తోందన్నారు. ప్రమాదాలు జరగకముందే తాత్కాలిక భద్రతా చర్యలు చేపట్టడంతో పాటు విద్యార్థులకు తగిన సూచనలు, సలహాలిచ్చి ఉంటే ప్రాణాలు పోయేవి కావని అభిప్రాయపడ్డారు. జిల్లాలో ఇటువంటి భద్రతాగోడలు లేని పాఠశాలలు ఎన్ని ఉన్నాయో సంబంధిత వివరాలు యుద్ధ ప్రాతిపదికన అందిస్తే విద్యార్థుల భవితను దృష్టిలో ఉంచుకొని ఉన్నతాధికారులకు సిఫారసులు చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.





# ఆన్‌లైన్ యాప్స్‌పై అప్రమత్తం కావాలి

(సత్యంన్యూస్, రేగిడి)

ఆన్‌లైన్ యాప్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని స్వచ్ఛభారత్ మండల కో-ఆర్డినేటర్ పద్మ అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్న స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని బూరాడ గ్రామంలో టెక్నాలజీ, యాప్స్‌ను జాగ్రత్తగా వాడాలన్నారు. అనవసర యాప్స్, గాడ్జెట్స్, లింక్స్ వాడకుండా ప్రజలను చైతన్యం చేయడానికి ప్రభుత్వం స్వచ్ఛతా హి సేవలో భాగంగా ప్రచారం చేస్తుందన్నారు. ఈనెల తేదీ 17నుంచి అక్టోబర్ ఒకటి వరకు ప్రత్యేక కార్యక్రమాలు ఎంపీడీఓ శ్యామలకుమారి, ఈఓపి ఆర్‌డి సత్యనారాయణ ఆధ్వర్యంలో మండలంలోని అన్ని పంచాయతీలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బి.దాలినాయుడు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఈనెల 28న ప్రత్యేక పూజలు

(సత్యంన్యూస్, నరసన్నపేట )



వంద రోజుల పాలనలో తప్పులను కప్పిపుచ్చుకోవడానికి, ప్రజల వ్యతిరేకతను దృష్టి మరల్చడానికి రాజకీయ కారణాలతో కావాలని అబద్ధాలాడి తిరుమలను అపవిత్రం చేసిన చంద్రబాబుకు జ్ఞానోదయం కలగాలని ఈనెల 28న జిల్లావ్యాప్తంగా ప్రత్యేక పూజలు చేయాలని వైకాపా జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ పిలుపునిచ్చారు. గురువారం ఒక ప్రకటన విడుదల చేస్తూ తిరుమల పవిత్రతను, స్వామివారి ప్రసాదం విశిష్టతను, వెంకటేశ్వరస్వామి వైభవాన్ని, టీటీడీ పేరు ప్రఖ్యాతులను, లడ్డూ పవిత్రతను దెబ్బతీసి తమ కుట్ర రాజకీయాల కోసం కోట్లాదిమంది భక్తుల మనోభావాలను కించపరిచిన చంద్రబాబు, పవన్‌కళ్యాణ్, లోకేష్‌ను క్షమించి వదిలేయమని, రాష్ట్రం సౌభాగ్యంగా ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నామన్నారు. శరీరం, ఆత్మ వేరైనా చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఇద్దరూ ఒకటేనని విమర్శించారు. చంద్రబాబు మాట్లాడిన మలినపు మాటలకు పవన్ కూడా వత్తాసు పలికారని తెలిపారు. ఎన్నికలకు ముందు చంద్రబాబు అనేక హామీలు ఇస్తే వాటికి పవన్ వత్తాసు పలికారని పేర్కొన్నారు. ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత గ్యాస్ సిలిండర్లు, అమ్మకు రూ.18 వేలు.. ఇలా అనేక హామీలు ఇచ్చారన్నారు. వీటిని అమలు చేయలేక చేతులెత్తేసి ప్రజలనె మాయ మాటలతో అబద్ధాలను ప్రచారాలతో మైమరపించే చర్యలకు దిగారని విమర్శించారు.

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.